# సౌందర్యోపాసకుడు

కళావధాని వేలూరి శివరామశాస్త్రిగారు

## ౧

అప్పటి కింకను క్షత్త్రియరాజ్య మంతరింపలేదు. బౌద్ధమతము పడిపోవుటకుఁ బ్రవణమై యున్నంత యుచ్చస్థితిలో నుండెను.

అకళంకదేవునకు లేక లేక కలిగిన విజయవర్మవలనఁ బొడకట్టిన యానందము ముందు తన వేయిగ్రామాదులవలనఁ గలిగిన యానంద మొకయానంద మనిపింపలేదు.

విజయవర్మ యొక్కఁడే యయినప్పటికిఁ బదిమంది కొడుకులపెట్టు. అల్లరిచేయుచోఁ గార్తవీర్యునకువలె వేయిచేతు లున్నవా యని యనిపించును. చదువుచోఁ జతుర్ముఖ బ్రహ్మయే; పాడుచో గంధర్వుఁడు; గుఱ్ఱ మెక్కుచోఁ గిన్నరుఁడు.

అకళంకదేవునకు విజయవర్మ యనఁగా అవతరించిన ఆనందము. ఆయానందమును హృదయగుహలో దాఁచుకొనువాఁడు కాని యేకాంతమునందేని పట్టమహిషియగు జయకుఁగూడఁ గానిపింపఁ జేయువాఁడు కాఁడు.

కొండమీఁది కోఁతి కావలయునెడల విజయవర్మ కప్పటికపుడు సిద్ధము. అతనిమేడ నొక ప్రదర్శనశాల యని యనవచ్చుఁగాని చూచువాఁ డాతఁ డొక్కఁడే.

విజయవర్మ తనయుద్యానమున ద్వీపాంతరానీతములగు తీవలఁ బాఁతించెను. వానిని కుక్కలవలెను, కోళ్లవలెను, మనుష్యులవలెను గత్తిరించి క్రొత్తక్రొత్త దోహదము లొనరించి క్రొంగ్రొత్త పూలఁ బూయించును. వానిని జూచుచోఁ జైతన్యము సర్వపదార్థములకును గని యని తోఁపకమానదు.

దైనందిన మతనిమేడలో గాజుపళ్లెరములందును వెండిపళ్లెరమునందును విచ్చినపూలు భగవంతుని సహస్రనేత్రములవలెఁ బ్రకాశించుచుండును. అతఁడు తన పూఁదోఁటలోని పూమొగ్గలఁ గోసికొనివచ్చి యాఁది వికసింపఁ జేయఁ బ్రయత్నించును. అవి కోపముచెంది నటులు ముడికొంచెము ముకుళించుకొనిపోవఁగా విచారముతో వానినిగనుచుఁ గూర్చుండును.

అతఁడు ప్రతిదినమునను సముద్రతీరమున ఆలిచిప్పలు, నత్తగుల్లలు లోనగునవి పోగుచేయును. ఆతఁ డిదివఱకు నిలువచేసిన వానితో నొకమేడ కట్టవచ్చును. అతిపరిచితులగు సేవకులు కొంద ఱాతని 'ఆలిచిప్పలదొర, ఆలిచిప్పలదొర' యని అపుడపుడు కీర్తించుచుందురు.

విజయవర్మకు వస్త్రములన్న కడుఁ బ్రీతి. అతఁడు నిన్నఁ గొనిన వస్త్రములమీఁది సంఖ్య పదివేలపై చిలుకు. నేఁడు కొనిన వస్త్రములమీఁదిసంఖ్య పదియేఁడువేల పై చిలుకు.

ఏసేవకునియొద్ద పవిత్రమగు వస్తువుకాని యుంచినను విజయవర్మ 'దీనిని నాకిత్తువా?' యని యడిగి తీసికొనునంతవఱకు తన ఘనతను పల్లము చేసికొనెను. కాని వారి కిబ్బడివెల యీయకుండలేదు. ఇటులనొకటనే నొకానొకపు డితనికడ ఒక బంగారుదొంగవెల రెండు కాసులవఱకు చెల్లించెను.

విజయవర్మకు కొంత యీడు వచ్చినది. గురుకులమునఁ బ్రవేశించి ముక్కాఁకలు తీర వలసిన కాలము వచ్చినదని యాచార్యులు నిర్ణయించిరి.

ఏగురుకులమునఁ జేర్పించుట? అని అకలంకదేవుఁ డాలోచించుచున్నాఁడు. ఎవరిమీఁద నేని ప్రీతిగాని కా ముదాసీనులవలె నుండి సకల మనుష్యపించుట పెద్దమనుష్యుల లక్షణము కదా! అతఁ డొకనాఁడు తనభార్య జయతో— 'దైవము మనవాలఁ గలఁడు. అబ్బాయికి గురుకులమునఁ బ్రవేశింపఁదగిన యీడువచ్చినదని యాచార్యు లన్నారు. కుఱ్ఱఁడు కొంతకాలము మనవద్ద నుండకపోయినను సంపాదించుచుండు విజ్ఞానముచేతనే మన కత్యంత సన్నిహితుఁ డగును.' అనియెను.

దేవి జయ అన్నది, "ఆహా! తమ కెంత పుత్రప్రేమ లేదో! 'ఈ సంవత్సరము దాఁటనిండు! పైసంవత్సరమునకుఁ జాలమంచి దైన ఆచార్యులకుఁ జెప్పలేకపోతిరా?"

ఈసంభాషణము దాసీపరంపరగా ఆచార్య కర్ణతాడిత మయినది. దాసీకలనుండి వచ్చు రహస్యవార్త కడు నిశితమైనదికదా! ఆచార్యదేవులు చేతులు కట్టుకొనివచ్చి యెదుట నిలువఁబడి మహారాజాధిరాజా! కుమారదేవుని కింకను సరియగు ఈడు రాలేదు. పై సంవత్సర మత్యుత్తమమని మనవిచేసిరి. విధి యనుకొనెను—'రాజులపాదములచేఁ ద్రొక్కఁబడుచుండుట నాకు విధియే.'

౨

విజయవర్మ తండ్రిమాటలు తల్లిమాటలు ఆచార్యుల మాటలు వినినాఁడు. ఒకనాఁటి తెలవారుజామున లేచి ధరణికోటలోనున్న గురుకులమునకుఁ దనంతటఁ దాను పోలీసులకు అధీనుఁడగు దొంగవలె అధీనుఁ డయినాఁడు. 'తాను ఫలానా' అని చెప్పుకొనువఱకు అతఁ డెవరో ఎవరికిని తెలియలేదు.

ఏ మీవింత? ఇదివఱ కేరాజకుమారుఁడైనను రోగ మభినయింపక, దాసీగృహముల దాఁగుకొనక, దేశాంతరము పాఱిపోయి పట్టుపడక గురుకులమునకు స్వాధీన మయినాఁడా? క్షత్రియకులమునందుఁ గూడ విజ్ఞానమున కితఁడు మూలపురుషుఁడు కాఁబోలునని ఆచార్యులందఱు ఆశ్చర్యపడిరి.

జయాకళంకదేవు లావార్త విని 'మేము ధన్యుల మైతి' మని సంతసించి ఆచార్యులకుఁ గానుక లంపినారు. ఉపాచార్యుఁ డతనిని తన సమక్షమునం దుంచుకొని నియమావళిని చెప్పెను.

విజయవర్మ మత్స్యమాంసములు సులభముగనే విసర్జించెను. హాయవ్యసనముకూడ కొలఁదినాళ్లలోనే వీడఁగలిగెను. కాని, కంకణ ధ్వనులు కాయపారవశ్య మొనరింప దాసికలు కాళ్లొత్తుచుండ నిదిరించు వేళలలో వచ్చి 'నాయనా! సుఖనిద్ర పొందు'మనియు, మేలుకను వేళలలో వచ్చి 'సుఖనిద్రయా?' అని యడుగుతల్లి దివ్యదర్శనము లేకపోవుట మాత్ర మాతనికిఁ గొంచెము కష్టము కలిగింపక మానలేదు.

విజయవర్మ మాకడ అత్యాచారము చేసినాఁడని యేగురువును ఉపాచార్యునికడ దోపనివేదన మొనర్పలేదు. దానివలన మిగులు విద్యార్థులందఱకును విజయవర్మపై గుఱ్ఱు. ఏనాఁటిపాఠ మానాఁట మాచికొనక యేయాచార్యుఁడయినను విజయవర్మకు పాఠము చెప్పలేదు.

'మహారాజా! కుమారదేవునివలన గురుకులము గురుకులముతిరుగా నున్నది. ఏలినవారికి పాఠము చెప్పుటకు ఆచార్యులు జంకిపోవుచున్నా'రని గురుకులమునుండి తిరిగి వచ్చుచున్న సేవకులు మనవులు చేయుచున్నారు.

'మహాదేవీ! రాజకుమారుఁడు రాజకుమారుఁడే. మీరు పంపినఖాద్యము లాశ్రమాచార విరుద్ధములని కాఁబోలు మూచూడనైన మూచూడలేదు. మిఠాయికన్న చదువే యేలినవారికి తీపిగా నున్నది. ఆలిచిప్పలబాబు చదువులబాబై పోయె'నని దాసికలు జయకడ చెప్పుచున్నారు.

## 3

విద్య యెంతయో సుందరమైనదై యుండవలయును. కానిచో విజయవర్మ అంత తత్పరుఁడై యుండఁజాలఁడు. తార్కికుఁడా! ఈ వ్యాప్తి నధిక్షేపింతువేమో! సుందర మగు వస్తువు కానిపించుచో నది విజయవర్మ పరము కావలసినదే! కావుననే యతని మేడ యొక ప్రదర్శనశాలగా మాఱినది. అందు నత్తగుల్ల మొదలుకొని నవమాణిక్యములవఱకు ఉన్నవి. అతనిమేడలో అందముకానిది లేదు. దానిచే విద్యగూడ సుందర మనుచుంటిని.

సుందరమగు వస్తువును జూచి యానందించుట కొందఱప్రకృతి. దానిని గ్రహించి యానందించుట కొందఱప్రకృతి. అది స్వాధీనము కానిదే యానందింపఁ జాలకుండుట కొందఱప్రకృతి.

జ్ఞాని విచ్చిన పూవునందే భగవంతుని జూచి యానందించును. భక్తుఁడు దాని కోసి కొనివచ్చి భగవానునర్చించి యానందించును. కన్య దానిద్రుంచి తుఱుముసఁ దుఱుముకొనకుండ నానందింపలేదు.

సుందరమగు వస్తువనినచో నభిలాషలేనివాఁ డెవఁడు? ఒకసుందరమగు పరమ వస్తువు కెనకే యీజగతియంతయుఁ బరుగిడుచున్నది.

సుందరమగు వస్తువు లందఱకుఁ జిక్కునా? రాజులకన్న ధనవంతుఁడు అధికారము కలవాఁడును అయినంతమాత్రమున అతనికిఁ గూడ అన్నియుఁ జిక్కునను నమ్మక మెటులు? హృదయగుహానిహితమయిన వస్తు

వునుగూడ బయలుపఱచి స్వాధీనము చేసికొనగల విజయవర్మ యిపుడు నియమములను మనసులో తెలిసికొనియుండుటచేతనకు హస్తామలకముగూడ లభించునని నిశ్చయము పోయినది. అయినను విజయవర్మ తన కుటీరమును తనరహస్య ప్రదర్శనశాలగా చేసికొనక మానలేదు. ఆయరణ్యమున వికసించిన యేవిజాతీయమగు పూవును ఆతనిచేతఁ బడక మానలేదు.

అతని కీయాశ్రమములలోని పోకపాత్రలు, జంద్రములు ఉద్ధారిణులు, గావంచాలు, తాటాకు పుస్తకములు, గంటములు: భూర్జపత్రములు, రుద్రాక్షలు మొదలగువస్తువులతినూతనములు. అవిఅతనికివిచిత్రమగు ఆహ్లాదమును కలిగించినవి. ఎవరి నడిగిన ఎవరిత్తురు? ప్రతిదినము ఆవస్తువులు కానఁబడినపుడెల్ల విజయవర్మ హృదయమునందు ఉల్లాసము కలుగుటకు బదులు నొప్పి కలుగుచుండెడిది. క్రమక్రమముగా ఆనొప్పి తీవ్రమై యొకరోగముగా పరిణమించినది. సుందరమగు వస్తువును జూచినపుడెల్ల దాఁగియుండిన యారోగము బయటఁ బడుచుండెడిది.

ఒకనాఁడాతఁడు సుషేణుని యాశ్రమములోనికి వెళ్లెను. తలుపు తెఱచియున్నది కాని సుషేణుఁ డందు లేఁడు. విజయవర్మ గుండెలు తటతట కొట్టుకొన్నవి. అంతట వెలుపలికి వచ్చి ప్రాంతములు పరిశీలించెను. సుషేణుఁడు కానరాలేదు. గద్గదస్వరముతో 'సుషేణా సుషేణా' యని పిలిచెను. దొంగతనమునకు చాలికానివలెనున్న యా గద్గదస్వరము విజయవర్మ హృదయగుహాయందే ప్రతిధ్వనించినదికాని సుషేణుని ప్రత్యుత్తరము కొనిరాలేదు. మఱల నతఁడు దొంగవానివలె కుటీరములోనికిఁ జనెను. అచటనున్న పోకపాత్రి, గంటము, మారేడుబుఱ్ఱ యీమూఁడును అతనికి చాలఁగాలమునుండియు రోగకారణములుగా నున్నవి. వెంటనే యతఁడు వానిని దీసికొనెను.

భూకంపమొకటి క్రిందఁ బ్రసరించినటులు అతనిపాదములు వడఁకెను. సిగ్నల్ కొట్టులోని యినుపచేతులవలె అతని చేతులు కదలెను. అతఁడు వాని నన్నింటిని పలుచనైన మట్టిముద్దవలె జాఱవిడిచి వాకిటి కడకు పరువెత్తుకొని వెళ్లి నలువైపులు చూచెను. కాని యేమి కానరాలేదు. క్రమ్మఱలోనికేఁగి వానినన్నింటిని మూటకట్టుకొనెను. నడుమ నడుమ ఉలికిపడి చూచుచు తన యాశ్రమమునకు నడిచెను. తలుపులు మూసి ఆవస్తువుల నన్నిటిని క్రిందఁబఱచి చూచుకొనెను.

వాని నెచట దాఁచవలెను? పెట్టె పెడ లేదు. అతఁడు తవ్వుగోలఁ గైకొని యాపర్ణశాల మిడతగోడకు గజమున్నర యెత్తున తవ్వ మొదలిడెను. శరీరము చివికిపోవఁగా కంకాళము బయటబడినటులు గోడలోని వెదుళ్లు బయటబడి కటకట లాడఁజొచ్చెను. మృదువగు ఆఘాతములతో నాలుగుబెత్తెడుల సొరంగము చేసెను. ఎడకొనకు కన్నమువంటి సొరంగమున వానిఁబడవైచిపోయి మఱలనొకతూరి ఆవస్తువుల నన్నిటిని గాంచెను. పిదప వాని నాసొరంగములోఁ బడవైచెను. నా సౌందర్య

ముతోపాటు నీసౌందర్యముకూడ భ్రష్టమైనది సుమీ యని చెప్పినటులు చప్పుడు చేయుచు అవి అందు శాశ్వతవసతిని చేకొనెను. అతఁడు కవాటములు తెఱచి యాలోచించుచు కూరుచుండఁగా తనహృదయ కవాటములు మూసికొనిపోయెను.

౪

పూర్వము విజయవర్మ సుందర మగు వస్తువు కానిపించుచో రెట్టికిరెట్టి వెలయిచ్చి కొనుచుండువాఁడు. కొనఁదగిన వస్తువే అతనికి కానఁబడుచుండెడిది. లేదా లభ్యమగు వస్తువే యతనికి కానఁబడుచుండెడిది.

ఇపుడు తనకడ ధనము ఉండరాదు. సామాన్యముగా ఏవస్తువును యాచింపఁగూడదు. ఒక యుపాయము మాత్రమే శేషించినది: అది చౌర్యము.

సుందరమగు వస్తు వున్నచో మనస్సంయోగము లేకయే యతని కనులు చూడఁగలవు. కాళ్లు నడువఁగలవు. ఎవరికిఁ గానరాకుండ తీసి చేతులు దాఁచుకొనఁ గలవు. విద్యతోపాటీవిద్యయు అతనికి దాటు తెలిసినది.

గురుకులమునందలి విద్యార్థులలో అపుడపు డీవిషయములు జరుగుచుండెడివి. 'నా పోకపొత్తి నీవు చూచితివా?' అని ఒకఁ డొకని నడుగును. మిగుల శ్రమించి సెనగకాయలో ఇముడునటులు వడికి గురువుగారికి సమర్పింపఁ దలఁచుకొనిన నా జందెములు పోయినవని ఒకఁడు అందఱమెడలు పరీక్షించును. నా పుస్తకమే పోయెనని ఒకఁ డుపాచార్యునికడ మొఱలిడును. ఒకఁడు నడిరేయి పోయిన తనగావంచాకొఱకు అందఱు మూటలు విప్పి పరికించుచుండఁగా మఱియొకఁడు లేచి 'దొంగ దొంగ' యని కేకలు వైచెను. అతఁ డెంత మొత్తుకొన్నను పలువు రాతని శంకించిరి.

ఆచార్యులలోఁగూడ కలవరము కలుగక మానలేదు. ఉపాచార్యుని భక్తిసూత్రములు పోయినవి. దానిచే నొకనాఁడు అందఱు అనధ్యయన మహోత్సవ మనుభవించిరి.

'ఎత్తుకొనిపోవుచో ఎత్తుకొనిపోయెను. వెలయిచ్చెదను. నాగంటము నాకిమ్మని వ్రాయసకాఁడు అంగలార్చెను.

ఎవరికిని పెట్టెలేదు; ఎవరికడ ఏవస్తువును కానరాదు. కావున ఆ యభావసింహాసనముమీఁద నొక దయ్యమును వారందఱు పట్టాభిషేకము చేసిరి. 'నేను నడిరేయి యావలికిఁ బోవఁగా ఒక దయ్యము భూర్జపత్రము లెత్తుకొని విజయవర్మకుటీరముమీఁదు గా ఱెప్పున ఎగిరిపోయిన' దని ఒకవిద్యార్థి మిగిలినవారితోఁ జెప్పెను. అతఁడు చెప్పినటులు భూర్జపత్రాలులేవు. ఆదయ్య మిటులు గురుకులమున నిరంకుశముగా పరిపాలింపఁ జొచ్చినది.

ఇవన్నియు నబాబుల 'తోషేఖానా'లోఁ బడినటులు విజయవర్మ సారంగములోఁ బడుచున్నవి. తమతమ వస్తువులు చూచుచుండఁగనే పోయినవని వారువారు చెప్పుచుండఁగా వినినపుడు విజయవర్మ కపహరించి నందులకు

భయమును, పట్టుపడనందులకు సంతోసమును గలుగుచుండెను.

షికారు వెళ్ళినపుడు 'నాకు దేవశర్మ మీఁద బలవత్తరమగు అనుమాన మున్న'దని యొకఁడనఁగా మఱియొకఁడు 'కాదు కాదు; వాఁడటువంటివాఁడు కాఁడు; నయగుప్తుఁడు ఎల్లపుడు మూటలు సర్దుకొనుచుండును; ఇది వాని పనికావలయు'నని గద్దించి పలికెను. మఱియొకఁడు 'చీ చీ వాఁడసలే కోమటి. అందులో దయ్యపుభయము. ప్రతిపదమునందును తననే యెపుడెత్తుకొనిపోవునో యని మోకాళ్లుపట్టుకొని కూర్చుండుచున్నాఁడు. వాఁడు కాదురా! దేవదాసుఁడు ప్రతికుటీరము పనిలేనిదే పగలే తిరుగును. ఇది తప్పక వాని పని' అనెను. ఇదంతయు నాలకించి విజయవర్మ 'డబ్బొకచోట అనుమానమొకచోట' అని తీర్పుచెప్పెను.

ఆచార్యగణముకూడ ఈ దొంగతికమునకు లోలోపల చాల బాధపడఁజొచ్చిరి. పాఠములు చెప్పునపుడు చౌర్యముపైనే సగము పాఠము. ఆకాలమున ఏవిద్యార్థియు పాఠమునకు ప్రాలుమాలలేదు.

౫

విద్యార్థులలో కొందఱు కొందఱిమీఁద తమ కనుమానమున్నదని చెప్పినపుడును తన కుటీరమునందలి సారంగమునుగాంచినపుడును సుందరవస్తు సందర్శన మయినపుడును విజయవర్మ ఒక సర్వాంగీణమగు కంపము చెందుచు 'ఇది తప్పు' అని ముమ్మాఱు అనుకొనును.

అతఁ డేకాంతముగాఁ గూరుచుండి 'ఇది తప్పా?' అని దీర్ఘముగా నాలోచించువాఁడు. దొంగతనము నిటులు సమర్థించుకొనువాఁడు: 'తనకుఁ గావలసిన వస్తువును తాను తీసికొనుట ప్రతివానికిని విధి. గురువుకడనుండు విద్యను శిష్యుఁడు తీసికొనుచున్నాఁడు. కాని సమ్మతించియే గురువు దాని నిచ్చుచున్నాఁడు. అడవిలోని వృక్షముల పండ్లను జంతువులు, మానవులు, కీటకములు సమానముగా ననుభవించుచున్నవి. కాని 'ఇవి నావి' అను నాథుఁడు. ఒకరాజును జయించి మఱియొకరాజు వాని ముత్తాలన్నియు కలిపికొనుచున్నారు. కాని యిది పరాక్రమము. ఆఁడుదానిని మగవాఁడు, మగవాని నాఁడుది పరస్పర మాకర్షించి యపహరించుచున్నారు. కాని యిది ప్రేమ. ప్రతిదినము ప్రతివాఁడు పంచభూతముల నపహరించుచునే యున్నాఁడు. కాని యిది పుట్టుతోనే సిద్ధించిన హక్కు. పట్టువడనిచో రాజు; పట్టుపడుచో దొంగ. జగత్తంతయు దొంగల కొట్టే.

మఱల ఆలోచించి యాలోచించి కొంత సేపటికి ఇటులు ఖండించుకొనువాఁడు: 'దొంగతనము తప్పే; కానియెడల వస్తువుల నపహరించునపుడు నాశరీరమంతయు నేల కంపింపవలయును? మఱియు నే నావస్తువుల నేల దాఁపవలెను. ఆవిషయమును పేరందఱు నాతో ముచ్చటించినపుడు నాకేల చెమట పోయవలెను. పాఠవేళలో నచార్యుల మోముమాచుటకు నేనేల జంకవలయును? ఆయా వస్తుస్వాములు కానఁబడినపుడు నేనేల తొలఁగిపోవలయును? పేరందఱు నెట్టివారు; కాని ఒక త్రుటిలో నన్నుఁ బట్టివేయవచ్చునే! 'వీఁడుగో

దొంగ' అని నా మొగమున వ్రాయఁబడినటులు లేదా? ఆహా! మనస్సెంత దొడ్డది! ఎన్ని విచిత్రవస్తువులను ఇతరులకుఁ గానరాకుండ దాఁచుకొనుచున్నది! దీని కింతశక్తి యెందుల కనఁగా కొంతకాలమున కేని జీవి దారిలోనికి రాగలఁడేమో యని.

'దొంగతనము తప్పేయగునెడల నేనీపని నుండి నివృత్తుఁడఁ గావలయును.' అని తనకుటీరపుసారంగముకడ కరిగి నిలిచెను. అది అతి భయంకరమగు గుహవలె నతనికిఁ గానిపించెను. 'ఓరీ! నీవు దొంగవైయుండ దేవశర్మ నయగుప్త దేవదాసులు దొంగలుగా తలఁపఁబడుచున్నారు!' అని యాసారంగము సంబోధించినటులుండెను. విజయవర్మ తనమనస్సులోనే సారంగము పడినటులు ఏనడిరేయినో వాని నన్నిటిదీసి యావల పాఱవైవఁ దలఁచెను; కాని ఆగోడ పడఁగొట్టనిదే యతని యూహ నెఱవేఱదు.

వాకిట కాలిచప్పుడు వినఁబడఁగా విజయవర్మ గబగబ వెలుపలికి వచ్చెను. ఆవచ్చువాఁ డుపాచార్యుఁడు.

నన్ను బట్టుకొన వచ్చుచున్నాఁడా? ఇది నీకు తగదని శాసింప వచ్చుచున్నాఁడా? అని తలఁచుచు అతనికి వందనము చేయుటగూడ మఱచెను. దయచేయుఁ డనికూడ అనలేదు. ఉపాచార్యుఁ డీ యుపచారముల కతీతమగు విషయము నాలోచించుచుండెఁ గాఁబోలు! ఎన్నటి యుపచారములకు లోభపడ లేదు. తొంటియట్ల దానే యరుఁగుపైఁ గూరుచుండి 'ఇంటి దొంగను ఈశ్వరుఁడైనఁ బట్టుకొనలేఁడు' అనెను విజయవర్మ తెల్లఁబోయెను. పిదప నుపాచార్యుఁడు 'ఇదంతయు నీమీఁదనున్నది' అనెను.

విజయవర్మ మనస్సు కానిపించునేని దానిలో కోటానకోటులు బీఁటలు పడియుండును. తనను తన సారంగము నిఁకఁ బట్టుకొనుటకు పలువురు వత్తురని యతఁ డనుకొనెను.

ఉపాచార్యుఁ డిటులనెను—'ఓయీ దేవశర్మ నయగుప్త దేవదాసులపై ననుమానమును జాల్మంది రూఢి చేయుచున్నారు. ఇది తేల్చి నూభారము తీసివేయవలసిన విధి నీపైనున్నది.'

విజయవర్మ యూఁపిరి తిత్తులు క్రమక్రమముగా గాలిపోసికొనఁ జొచ్చెను. అతఁ డొక యుచ్ఛ్వాసము తీసికొని 'ఇఁక నేను పట్టుకొని తీతెదను.' అని స్ఫుటతరముగాఁ ననెను.

ఉపాచార్యుఁ డాశీర్వదించి వెడలి పోయెను. విజయవర్మ 'సొమ్మొకచోట అనుమానమొకచోట' అని బిగ్గఱగా ననుకొనియెను.

౬

విజయవర్మ ఒకనాఁడు ఉపాచార్యునితోఁ బ్రసంగింప నతని కుటీరమునకుఁ జనెను. తాటిమట్టలతోఁ జేసిన చెప్పులు ముంగిట నవనవలాడు. తమలపుటాకుల వలె ఏకాంతముగా మెఱయుచున్నవి. అవి మమ్ము తీసికొనుము మమ్ము తీసికొనుమని నిర్బంధపెట్టఁగా ఎట్టకేలకు సమ్మతించినటులు విజయవర్మ చేతులు వానిపైఁబడెను. వాతరోగ మంకురించినటులు

వానిశరీరమంతయు నొకసారి కంపించెను. అతఁ డా చెప్పులను గ్రక్కున బైకెత్తి చెప్పుతినిన లేడి వ్యాఘ్రమునుజూచినలేడివలె వణఁకెను.

వీనిఁ జేత తొడుగుకొనుటకా వీలు లేదు. కాని అవి నాకు వలయును. కాన వీని నపహరించుటలో నేదో సత్య మున్నది. అని యాలోచించుకొనియెను. ఆమఱునాఁ డా చెప్పులుకూడ ఆసారంగమున రాణివాస మనుభవింప మొదలిడెను.

ఉపాచార్యుఁడు ఆచార్యునితో 'నాకును తిరుమంగళ్యాత్రా సెలవుగావచ్చె'రని చెప్పుకొనెను. అతఁడు విజయవర్మను బిలిచి 'ఓయీ రేపటినుండి సెలవులుకదా! విద్యార్థులమాట లన్నియుఁ బరికించి దేవశర్మాదుల మూవు రను గురుకులమునుండి తొలఁగింపుము' అని యాజ్ఞాపించెను.

విజయవర్మ సునిశితముగా ఆలోచించెను. 'ఇఁక వడిగానే పట్టుబడఁగలదు. అనుమానము నమ్మఁదగదు. సెలవులు ముగిసి యందఱు వచ్చినపిదప కరణీయమును విన్నవించెదను' అనెను. ఉపాచార్యుఁ డతికష్టముమీఁద సమ్మతించెను.

విద్యార్థు లందఱు గురుకులాశ్రమద్వార ముకడఁ దమతమ మాటలు విజయవర్మ కడ విప్పి వెళ్లుచుండిరి. విజయవర్మ యే మాటను బరికించుటయేలేదు. తన హృదయపుమాటను విప్పి చూపించుచున్నటు లున్నది. అందఱును నిష్క్రమించిరి. వారందఱు వెళ్లిపోయినను అతఁ డాద్వారముకడ చాలసేపు నిలువఁబడి పోయెను.

ఆమఱునాఁ డుపాచార్యుఁడు తక్కఁ దక్కినవారందఱును వెడలిపోయిరి. తండ్రికడ నుండి పరివారము వచ్చినను విజయవర్మ గృహోన్ముఖుఁడు కాలేదు. 'విజయవర్మ గురు కులమునఁ బ్రవేశించుట యొకతూరియే నిష్క్రమించుటయు నొకతూరియే' యని యందఱను కొనిరి.

ఒకరేయి నతఁ డొంటరిగఁ గూరుచుండి సారంగమునందలి యాయాయి వస్తువులఁ దీసి చూడఁ దలఁపోసెను. చేయి లోపలఁ బెట్టి చూడఁగా చెప్పులందినవి. పైకిఁదీసి వానిచేత కుఁ జాలనానందించెను. తుదకు తొడుగుకొన వలయునని బుద్ధి పుట్టినది. తొడుగుకొనెను. అటిటు తిరిగెను. మెలమెల్లగా తలుపుతీసి కుటీరముముందు పచారు చేసెను. పండువెన్నెల తీవలమీఁదను, నేలమీఁదను పాలు పాఱఁబోసినట్లు ప్రవహించుచుండఁగా ఆప్రాంతము లన్నియు నడయాడెను.

తడపలన్నియు తెగి జోడు కాళ్లకు రాలేదు. కాలిజోడు చేతి కెక్కవలసి వచ్చెను. కుటీరములోనికిఁ జని దీపకాంతిలో దాని గాంచెను. తమలపాకువంటిది తాటాకయి పోయెను. 'ఒకసారి అనుభవించుటలో ఇది వఱకుగల సౌభాగ్యమంతయు నాశమయి నది' అని యనుకొనెను. చూడఁగా జూడఁగా దానిపై రోఁత పుట్టెను. వెంటనే విసిరి దూరముగా పాఱవైచెను. [illegible] లోకము మొగము చూ[illegible] కాలుపెట్టి యున్నది.

మఱునాఁ డుపాచార్యుఁ డాజోడును జూచి 'యిది యిచట నేల యున్నది? నీ వెఱుఁగుదువా?' యని విజయవర్మ నడిగెను.

విజయవర్మ పిడుగు పడినటుల నిశ్చేష్టుఁ డాయెను. ఇతఁడు నోటితో ఒప్పుకొనఁడు. ఇతఁడే వాని నపహరించెనని ముఖముపై చర్మముయొక్క అంచునఱకు వచ్చి మనస్సు సైగచేయుచున్నటు లుండెను. అతఁడు మాట లాడ లేకపోయెను.

'ఓయీ! నీవు దొంగ నెఱుఁగుదువు. వాని బండాలము బయటఁ బడకుండఁ గాపాడు చున్నటు లున్నావు. నిక్కము చెప్పు' మని ఉపాచార్యుఁడు నిలువఁదీసెను.

విజయవర్మ మాటలాడ లేకపోవుటగూడ తనకు ఉపకరించెను. కొంతసేపటి కతఁ డిటు లనెను. 'నే నతని నెఱుఁగుదును. ఇంతవఱకును అతఁడు దొంగయని నిర్ధారింపఁ జాలకుంటిని. బహువిధముల దొంగయే కావచ్చును. ఇఁకఁ గొలఁదినాళ్ళలోనే పరిష్కరించి మనవి చేసెదను.'

ఉపాచార్యుఁ డూరకుండెను. విజయవర్మ అతని ముందిఁక నిలువఁజాలక బయటికి వెళ్ళిపోయెను. ఉపాచార్యుఁ డతని మనస్తత్త్వ మరయఁజాలక విస్మయపడుచు నిష్క్రమించెను.

విజయవర్మ ఆనాఁ డంతయు తన నొక భూత మావేశించినటులు తిరుగాడెను. ఎటు [illegible]ను అతనికి మనశ్శాంతి కుదురలేదు. ఆపవ[illegible]యు తనను విచారించు న్యాయసభవలె [illegible].

సూర్యుఁ డపరాద్రి మరుగుసొచ్చి దొంగ వేషము తాల్చి వచ్చెనో యన చంద్రుఁడు మెలమెల్లగా మొగము బయటఁబెట్టుచుండెను. నీరవమును, నిస్తబ్ధమును అగు నా యేకాంతమున వెన్నెల వెఱ్ఱిదయ్యము వలె నతనికిఁ గానిపించెను. అతఁ డా వెన్నెల జూడఁజాలక నిదురింపఁ జనెను.

విజయవర్మ నిదురలో ఒక స్వప్నప్రపంచము చూచెను. ఆప్రపంచమంతయు ఆసారంగము. ఆప్రపంచమున మొదట నేమియు లేదు పిదప గ్రావాంచా లేచి నిలువఁబడి "ఓయీ! మొట్టమొదట నన్ను పైకిఁ దీసినవాఁడు బాలాకి. పిదప నతఁడు నన్ను రాటమునఁ బెట్టి సన్ననిదారముగాఁ జేసెను. తరువాతకొల్లాయ అను మాలనిమగ్గమునఁ బడి సుందరమగు స్థూలదేహము సంపాదించుకొంటిని. బాలాకి మంచినీట మెత్తగా నుదుకుచు గన్నేరురంగు పట్టించి తన శరీరముతోపాటు నన్ను వాడుకొనుచున్నాఁడు. నేను జలకమాడి దణ్ణము మీఁద నిదురించుచుండఁగా రావణుఁడు సీతాదుల నపహరించినటులు నీవు నన్ను దొంగిలితివి. నాకు వెలుఁగు లేదు. గాలి లేదు. ఎలుకలు నాడొక్కలు కొట్టివైచినవి. నాశరీరమును కొంత మట్టి తిన్నది. నాసూక్ష్మశరీరమే మిగిలియున్నది.' అని చెప్పుచుండఁగా గంటము ముందునకు వచ్చి నిలిచి 'నీవు నీగోలమాత్రమే చెప్పుకొనుచున్నావు. నీవు మాకందఱకు ప్రతినిధివి కావు. ఇఁక నీవాఁగుము. ఓరాజకుమారుఁడా! లేక సౌందర్యోపాసకుఁడ ననుకొను గజదొంగా! నీవు మొదట పోనుచున్న, కపా

త్తిని, మారేమి బుక్తను ఎత్తుకొని వచ్చితివి. పిదప ఎత్తుకొనివచ్చిన వస్తువులు మాయింటిలో గాలి పీల్చుకొనుట కుక్కిరి బిక్కిరి యగుచున్నవి. ['పక్క సారంగములోని మా మాట చెప్పవేమి?' అని కేకలు] నీవు మాసౌందర్యమునకు లుబ్ధుఁడవైన మాట నిక్కము. కాని మా సౌందర్యమేది? మాతోపాటు నీ ముఖ మెటులు మాఱినదో అద్దములో చూచి కొంటివా?' అని చెప్పుచుండఁగా సారంగముల లోని వస్తువులన్నియు పైకివచ్చి యతని ముఖమునుగాంచి 'ఛీ ఛీ' యనెను. భక్తిసూత్రములు పైకివచ్చి 'నీకు ఉత్తరజన్మమున చదువు రాదనెను. శ్లోకహస్తి గలగలలాడుచు నవ్వెను. ఉద్ధారిణి పంచపాత్రమున దొరలి గణగణ మ్రోగెను. పిదప ఘంటము వాని నన్నిఁటిని వెనుకకుఁ ద్రోసి యతని కంఠము కడకు వచ్చి 'నన్నెఱుఁగుదువా? మమ్ము మా యజమానుల కప్పగింపకున్న ఒకపోటు పొడిచెద' నని బాణమువలె బయలుదేరెను. పిదప ఉపాచార్యుఁ డొకముసుఁగు కప్పుకొనివచ్చి 'నాచెప్పులను నీవే దొంగిలితి'వనెను.

క్రమక్రమముగా ఆ స్వప్నప్రపంచము ప్రలయము పొందెను. రావిచెట్లపై కాకులు కాకా యని యఱచుచుండెను. విజయవర్మ ఉలికిపడి లేచెను.

౭

అట్టింటికేఁ దేవ కోడండ్రవలె విద్యార్థులు గురుకులమునకుఁ జేరుకొనఁ జొచ్చిరి. దయ్యమునకు భయపడి కోడలే మనవాని [illegible] పాకహస్తులను తెచ్చుకొనలేదు. పలనాటివారు గావంచాలు తెచ్చుకొనలేదు. దేవశర్మ నయగుప్త దేవదాసులును తుదకు గురుకులము పూరించిరి.

ఉపాచార్యుని కడనుండి విజయవర్మ కిటులు వార్త వచ్చెను: 'ఈదోషము నిర్ధారణము కానిది పాఠము లారంభింప వీలులేదు.'

అకలంకదేవుఁడు కుమారునకు యుక్త వయస్సు వచ్చినదనియు చదువు పరిపూర్తి యయినదనియు తెలిసికొని యౌవరాజ్యపట్టాభిషేకముతోపాటు పెండ్లియు తలపెట్టి ఆచార్యదేవులకు, కుమారునకు పంపిన వార్తలును అపుడే వచ్చినవి.

విజయవర్మకడకు ఆచార్యులును విద్యార్థులును వచ్చి తమ తమ యానందము వెలిపుచ్చి మునిముం దిచటనే పట్టాభిషేకము చేయ మొదలిడిరి. .

దేవశర్మ నయగుప్త దేవదాసులును ఇంకను అనుమానింపఁబడుచున్న పాకహస్తగుణాఢ్య శర్వవర్మలును, సునీతి పాంచాల బాదరులు లోనగువారును ప్రత్యేకముగా నతని దర్శింపవచ్చిరి. విజయవర్మ తలవంచుకొని కూరుచుండెను. మనస్సుతక్క శరీర మున్నటులు అతనికి తోఁచకుండెను. దేవశర్మ యిటులనెను. "మేము నిక్కముగా ఈ దొంగతనమెఱుఁగము. నీవు గురుకులము వీడి వెళ్లఁబోవుచున్నావు. నీతో నీకు సంబంధ తంతువు తెగిపోవుచున్నది. మమ్ము దొంగలుగా పరిగణింతువేని నీవే దొంగవగుదువు."

ఇటులు చెప్పుచుండఁగా ఉపాచార్యుఁ డచటికి వచ్చెను. అందఱులేచి యతనికి నమస్కరించిరి. ఉపాచార్యుఁ డిటు లనియెను: "వారికేమి సమాధానము చెప్పమనో చెప్పుము."

విజయవర్మ యిటు లనెను: 'అయ్యా! నిక్కము. దొంగ లెవరో నాకుఁ దెలిసినది. మీమీఁద దోషారోపణమునకు నా జాలమే కారణము. దొంగ యెవఁడో తేపకడ విశదము కాఁగలదు. తేపు నాకుటీరముననే దొంగ నిలిచియుండును. మీరు భీతిఁబాసి చనుఁడు.'

దేవశర్మాదులు సంతసముతో నిష్క్రమించిరి. ఉపాచార్యుఁడును అతని భావిపట్టాభిషేకమునకు సంతసముచూపుచు వెడలిపోయెను. విజయవర్మ ఒకతూరి నిట్టూర్చి "తేపు పట్టాభిషేకము, తేపు పట్టాభిషేకము!" అని యనుకొనెను.

దొంగ తేపు విజయవర్మకుటీరమున నిలిచి యుండునని ప్రతివాఁడును ప్రతివానిమోమును విలకించుచుండెను. విజయవర్మ మందుచేత నిలువఁబెట్టునా? మంత్రముచేత నిలువఁబెట్టునా? యని ప్రతివాఁడునుసందేహించుచుండెను. ఈ వినోదముతోడనే పగలెల్లయు ప్రాఁకిపోయెను. సూర్యుఁ డస్తమించెను. చంద్రుఁ డుదయించెను. వెన్నెల ఒక తెలియని వస్తుప్రపంచమునకు తెలుపు చున్నటులు కాయుచుండెను.

శిష్యు లందఱు భుజించి తమ తమ [illegible]లోని వస్తువులను గుఱించియు, భోజనములగుఱించియు చెప్పుకొనుచుండిరి. కొందఱు ఊఁకొట్టుచునే నిదురలో ఇమిడిపోయిరి.

ఆచార్యోపాచార్యులకు కానుకలర్పించి నయగుప్తుడు మొదలగువారు అపుడపుడే తమతమ పర్ణశాలలకు చనుచుండిరి.

విజయవర్మ పర్ణశాలమీఁద ఒకఘూకము అఱచినది. ఒకజాము ప్రొద్దుపోయిన దనుకొనుచు దర్భాసనములమీఁద నందఱు శయనింప దొరకొనిరి. తెలతెల వేఁగినదాఁక ఆప్రకృతి నింక నెవ్వరు చూడలేదు.

స్నానానుష్ఠానాదులఁదీర్చికొని యందఱును విజయర్మ కుటీరమునకుఁ బోవ నుద్యుక్తులగుచుండిరి. చాలమంది ఒకచోట గుమిగూడి ఉపాచార్యుని రాక కెదురుచూచుచుండిరి. ఆ సంఘములోని కపుడే నయగుప్తుఁడు వచ్చెను. 'నీవే అచట నిలువఁబడి యుందువని నే ననుకొంటి'నని బాలాకియనెను. 'అతఁడును అటులే అనుకొని రాత్రియంతయు గుంజకు మెడకు అంటగట్టుకొనె'నని దేవశర్మ పలికెను.

ఆచార్యుఁడును ఉపాచార్యుఁడును ఆసంఘముల నన్నిటిని జూచిరి. ఆచార్యునకు మనసులో నొకింత వ్యసనము కలిగెను. అతఁడు 'దేవునిగూడ నింత యుల్లాసముతో దర్శింపముకదా!' అని యనుకొని యుపాచార్యునితో నిటులనెను: "అయ్యా! మనమందఱ మీదొంగను జూడఁబోవుచో నతఁ డపుడే ప్రాణముల విడువఁగలఁడు. కావున విజయవర్మనే యిటకుఁ బిలిచి యతని రహస్యముగఁ గనుఁగొని దొంగను బాగుచేయుట మేలుకదా!"

ఉపాచార్యుఁడు సమ్మతించెను. ఎవరి కుటీరమున వారినుండ నియమించెను. తా నొకఁడే విజయవర్మ కుటీరమున కేఁగి తలుపు కడ నిలిచెను. తలుపులు మూసియుండెను. లోపల అలికిడి యేమియు లేదు. 'విజయ వర్మా!' యని పిలిచెను. ప్రత్యుత్తరము లేదు. ఎన్నిసారులు పిలిచినను పలుకులేదు. అది యతనికి విచిత్రముగా నుండెను. క్రమక్రమముగా నొకఁడొకఁడే వచ్చి పిలుచుచుండెను. తుద కందఱు పోగయిరి.

ఆచార్యుఁడు గునపముతెచ్చి తవ్వి తలుపుతీయ నాజ్ఞాపించెను. రెండు పోటులతో డనే ఆతలుపు ఊడిపడెను. అడ్డదూలమునకు తగిలించిన ఉరిలో బంధించుకొనిన మెడతో ఆకాశమున వ్రేలాడుచు విజయవర్మ నిలువఁబడియుండెను.

సంపూర్ణము

# కష్టమా!

సాహిత్యసరస్వతి సీరిపి ఆంజనేయులు గారు

దివ్యకరుణామహాత్మ్య నా దేశమునను
గాక నెవ్వాని నెగడు నెక్కుడు నుడుగు
నీచెలిమి జ్ఞానమునకు నెన్నిహిత హేతు
వనెడు ననుభవవిదుల యమృతంపు మాట,
అఖిలమున కింపునింపు వాక్యంబు సొంపు
నీవు లేకున్న లేదను నింపు పల్కు,
వీనులార వినియు నైజవిధిని దెలఁచి
వెఱచి నినుఁ జూడ నోడి నే నెక్కె నగుచుఁ
గష్టమా! నిన్నెఱుంగక కడపినాఁడ
బాల్యమంతయు నదె సుఖప్రదము గాఁగ;
ఎడనెడను నీవు నన్నుఁ బ్రేమించు వేడ్క
నెలమి దరిఁ జేర, నినుఁ దిలకింప జడిసి
దవ్వు దవ్వులఁ దలఁగుచుఁ దనిపినాఁడఁ
గాని, నీమాల్మికల్మి నేఁ గాంచనైతి.

కర్ణముల మ్రోఁగు నీదు చొక్కంపు చరిత
మదిగో! కమనీయ కావ్య వీణాంతరముల
కలవిరళరూఢి శబ్ద తంత్రులఁ గదల్చి
వంద్య సుమనోజ్ఞ మధుర ఘానస్వనాళిఁ
గొల్చి, వెస నీనిగారంపు గుణగణంబు
తెలియ విబుధులు కీర్తన సలుపుచుంట;
విశ్వమోహదమైన యావిమలగాన
రవము మనసార వింటి-మర్మమ్ముఁ గంటి-
నడఁగె నాలోని యలుకు దనంతెగాన,
నీయడుగు జాడలను భక్తి నిలిచి కొలిచి,
ముదల మెట్టి దేనియు నెంచమనక భరించి,
తత్త్వవిజ్ఞాన ధనము చిత్తమునఁ గూర్చి
నమ్మి, వర్ణింప నే చేయుచున్నాఁడ, నిదిగో!
రమ్ము! హృదయకవాటమ్ముల గనుము.